అక్కచెల్లెమ్మలకు ఆసరా

- మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం
- నేడు పొదుపు సంఘాల సభ్యులకు మూడో విడత సాయం విడుదల
- మండలంలో 8,621 మందికి లబ్ధి


పొదుపు సంఘాల మహిళల సమావేశం (ఫైల్)

కల్లూరు: మహిళల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారు. వారికి అన్ని విధాలుగా అండగా నిలబడుతున్నారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పొదు పు సంఘాల(డ్వాక్రా సంఘాల)మహిళలకు రుణ మాఫీ చేశారు. 2019 ఏప్రిల్‌ 11 నాటికి స్వయం సహాయక సంఘాల బ్యాంకు లింకేజీ అప్పు నిల్వ మొత్తాన్ని నాలుగు విడతలుగా విడుదల చేస్తున్నారు. ఆసరా పథకం కింద అక్కాచెల్లెమ్మలకు ఈ సాయం అందజేస్తున్నారు. ఇప్పటి వరకు రెండు విడతల్లో సాయం అందించగా నేడు మూడో విడత అందించనున్నారు. నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో సొమ్ము జమ కానుంది. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి సాయం అందజేస్తుండటంతో పొదుపు మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నాడు మోసం చేసిన టీడీపీ సర్కారు

2014 ఎన్నికల్లో పొదుపు సంఘాల రుణాలను మాఫీ చేస్తామని టీడీపీ హామీ ఇచ్చింది. అధికారంలోకి రాగానే మాఫీ హామీని చంద్రబాబు పట్టించుకోలేదు. నమ్మి రుణం చెల్లించని పొదుపు మహిళలు ఆ తర్వాత తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రజా సంకల్ప పాదయాత్రలో అక్కచెల్లెమ్మల బాధలను కళ్లారా చూసిన జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఏప్రిల్‌ 11 నాటికి ఉన్న పొదుపు సంఘాల బ్యాంక్‌ లింకేజీ రుణాలను మాఫీ చేస్తానన్ని హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే ఆసరా పథకం ద్వారా అమల్లోకి తెచ్చారు.

8,621 మందికి లబ్ధి

కల్లూరు మండలంలో 52 గ్రామైక్య సంఘాలు, 831 పొదుపు సంఘాల గ్రూపులు ఉన్నాయి. వీటిలో మొత్తం 8,621 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు.వీరికి 2019 ఏప్రిల్‌ నాటికి రూ. 19,76,99, 430.9 కోట్లు అప్పు ఉండేది. ఇప్పటికే ప్రభుత్వం రెండు విడతల ద్వారా రూ. 9,88,49,058 కోట్లు అందజేసింది. మూడవ విడత కింద నేడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మరో రూ. 4,94,24,529 కోట్లు ఇవ్వనున్నారు. దీంతో కల్లూరు మండలంలోని పొదుపు సంఘాల సభ్యులకు మొత్తం మూడు విడతల ద్వారా రూ.14,82,73,587 సాయం అందినట్లు అవుతుంది.

జీవనపాధి మెరుగునకు కృషి



రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తోంది. ఇందులో భాగంగా వైఎస్సార్‌ ఆసరా, సున్నా వడ్డీ, చేయూత పథకాల ద్వారా సాయం అందజేస్తోంది. ఈ సొమ్ముతో మహిళల జీవనోపాధి మెరుగుకు కృషి చేస్తున్నాం. వైఎస్సార్‌ ఆసరా మూడవ విడత కింద మండలానికి రూ. 4,94,24,529 కోట్లు విడుదల కానున్నాయి.

– శ్రీనివాసులు గౌడ్, ఏపీఎం, కల్లూరు.

క్లుప్తంగా

పోలీస్‌ స్టేషన్‌కు చేరిన ప్రశ్న పత్రాలు


ప్రశ్న పత్రాలను స్టేషన్‌లో భద్రపరుస్తున్న దృశ్యం

సి.బెళగల్‌: పదవ తరగతి పబ్లిక్‌ పరీక్షల రెండో సెట్‌ ప్రశ్న పత్రాలు శుక్రవారం మండల కేంద్రం సి.బెళగల్‌కు చేరుకున్నాయి. ప్రశ్న పత్రాలను రూట్‌ అధికారి, కోడుమూరు ఎంఈఓ అనంతయ్య, అదనపు రూట్‌ అధికారి, పెద్దపాడు జెడ్పీ హైస్కూల్‌ ఎస్‌ఏ హీరాలాల్‌ స్థానిక పోలీస్‌ స్టేషన్‌కు చేర్చి భద్రపరిచారు. మండలంలో మూడు పరీక్ష కేంద్రాలకు సంబంధించి మొదటి సెట్‌, రెండవ సెట్‌ ప్రశ్నా పేపర్లను భద్రపరిచినట్లు కాస్టోడియన్లు తెలిపారు.

వైభవంగా రామదాసు తాత రథోత్సవం

గూడూరు రూరల్‌: మండల పరిధిలోని మునగాలలో శుక్రవారం శ్రీ రామదాసు తాత రథోత్సవ కార్యక్రమం కనుల పండువగా సాగింది. జీవ సమాధి అయిన రామదాసు తాత రథోత్సవాలను గ్రామస్తులు ప్రతి ఏడాది ఉగాది అనంతరం నిర్వహిస్తారు. ఆనవాయితీ ప్రకారం శుక్రవారం చేపట్టిన ఈకార్యక్రమంలో ముందుగా రామదాసు తాత ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథాన్ని పూలతో సుందరంగా అలంకరించారు. తాత ఉత్సవ విగ్రహాన్ని ఆ రథంపై ఉంచి దేవాలయం నుంచి బస్టాండ్‌ వరకు ఊరేగించారు. భక్తులు కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘనటలు జరగకుండా ఎస్‌ఐ నరేంద్ర ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచు గోపాల్‌, గ్రామపెద్దలు రామాంజనేయులు, కుంటి చేయి గోపాల్‌, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి


సి.బెళగల్‌ స్కూలులో విద్యార్థిని చదివిస్తున్న ఎంఈఓ జ్యోతి

సి.బెళగల్‌: ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని ఎంఈఓ జ్యోతి అన్నారు. శుక్రవారం ఆమె మండల కేంద్రం సి.బెళగల్‌లోని రెగ్యులర్‌ ప్రాథమిక పాఠశాలలో 2022–2023 వార్షిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాల రికార్డులను, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, పాఠశాల పరిసరాల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. జగనన్న గోరుముద్దలో భాగంగా అమలవుతున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం తరగతుల వారీగా విద్యార్థులను పలకరించి వారి చదువు సామర్థ్యాలను అంచనా వేశారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని హెచ్‌ఎం కిషోర్‌కుమార్‌కు సూచించారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అమలు చేయాలన్నారు. ఆమె వెంట సీఆర్పీ శ్రీనివాసులు ఉన్నారు.

వాల్మీకుల హర్షం


మాట్లాడుతున్న మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఎల్‌.వెంకటేశ్వర్లు

గూడూరు: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశంపై అసెంబ్లీలో తీర్మానం చేయడం పట్ల శుక్రవారం స్థానిక వాల్మీకులు హర్షం వ్యక్తం చేశారు. వాల్మీకి దేవాలయంలో వాల్మీకి పట్టణ కమిటీ అధ్యక్షుడు మద్దిలేటి, కార్యదర్శి గిడ్డ య్య అధ్యక్షతన వాల్మీకులు అత్యవసర సమావేశం నిర్వహించి సీఎం జగన్‌మోహన్‌ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ముందుగా వాల్మీకి మహర్షి చిత్ర పటానికి పూల మాలలు వేసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ మెంబర్‌ ఎల్‌.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వాల్మీకుల చిర కాల కోరిక రాష్ట్ర శాసన సభలో తీర్మానం పొందడం సంతోషించదగ్గ పరిణామం అన్నారు. కార్యక్రమంలో నాయకులు రంగన్న, పత్తి రంగడు, సంగాల రామలింగడు, ఉగ్ర, సింగనిగేరి నాయుడు, పర్ల బాబు, విజయుడు, శివుడు, కృష్ణగిరి నాగరాజు, మేకల గిడ్డయ్య పాల్గొన్నారు.

30న కబడ్డీ పోటీలు

ఓర్వకల్లు: హుసేనాపురం గ్రామంలో ఈ నెల 30వ తేదీన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్‌ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామంలోని బైరెడ్డి నగర్‌లో శ్రీరామనవమి పండుగ సందర్భంగా నిర్వహిస్తున్న ఈ పోటీల్లో తొలి నాలుగు స్థానాల్లో నిలిచే జట్లకు వరుసగా రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల చొప్పున నగదు బహుమతులు ప్రధానం చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు రూ.500 ప్రవేశ రుసుం చెల్లించి జట్ల పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 9390351265, 9346094529 సెల్‌ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

భక్తజన సందడి


మూలపెద్దమ్మను దర్శించుకుంటున్న భక్తులు

గడివేముల: గడివేములలో శుక్రవారం మూలపెద్దమ్మ ఆలయంలో భక్తజన సందడి కనిపించింది. అమ్మవారి జాతర సందర్భంగా ఆలయప్రాంగణాలు భక్తులతో కిటకిటలాడాయి.శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు వారు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ చైర్మన్‌ తలారి చిన్నన్న,ఈఓ మోహన్‌ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఆత్మరక్షణపై అవగాహన

కల్లూరు: దూపాడు సమీపంలోని అశోక మహిళ ఇంజినీరింగ్‌ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్‌ బృందం ఆధ్వర్యంలో శుక్రవారం బస్తిపాడు పాఠశాలలో ఆత్మరక్షణపై బాలికలకు అవగాహన కల్పించారు. అనుకోని ఆపద ఎదురైనప్పుడు/ ఎవరైనా దాడి చేసినప్పుడు ఎదుటి వారిని ఎలా నిలువరించాలి? ఎలా ఎదుర్కోవాలి అనే విషయాలపై ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా చూపించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం కోఆర్డినేటర్‌ అబ్దుల్‌ రజాక్‌ మియ్యా, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా గిడ్డాంజనేయస్వామి వసంతోత్సవం


వెంకటగిరిలో శ్రీగిడ్డాంజనేయస్వామి వసంతోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం


ఆనందంగా రంగునీళ్లు చల్లుకుంటున్న యువకులు

కోడుమూరు రూరల్‌: ఉగాది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని వెంకటగిరి గ్రామంలో శుక్రవారం గిడ్డాంజనేయస్వామి వసంతోత్సవం ఘనంగా జరిగింది.గ్రామస్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఆశీనులు చేసి గ్రామలో ఊరేగించారు. ఈ సమయంలో గ్రామస్తులు ఒకరిపై ఒకరు రంగునీళ్లు చల్లుకుంటూ వసంతోత్సవం జరుపుకున్నారు.

ప్రతిపక్ష నాయకులను వేధించడం సరికాదు


సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు నరసింహ యాదవ్

కల్లూరు: దేశంలో ప్రతిపక్ష పార్టీల నాయకులను వేధించడం కేంద్రంలోని బీజేపీ సర్కారుకు పరిపాటిగా మారిందని కాంగ్రెస్‌ పార్టీ నంద్యాల పార్లమెంట్‌ జిల్లా అధ్యక్షుడు జె.లక్ష్మీనరసింహ యాదవ్‌ అన్నారు. శుక్రవారం నంద్యాల చెక్‌పోస్ట్‌ సమీపంలోని ఆ పార్టీ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాహుల్‌ గాంధీ ప్రశ్నించే తత్వాన్ని తట్టుకోలేకనే బీజేపీ కుట్రలు పన్నిందన్నారు. అందులో భాగంగానే పార్లమెంట్‌ సభ్యత్వంపై అనర్హత వేటు అని చెప్పారు. రాజ్యాంగబద్ధ సంస్థలను దుర్వినియోగం చేయడమే కాకుండా అత్యున్నత ప్రజాస్వామ్య వేదిక అయిన పార్లమెంట్‌ను సైతం తమ స్వార్థ ప్రయోజనాలకు వాడు కోవడం సిగ్గుచేటన్నారు. దేశంలో ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ విలువలకు చేటుకాలం దాపురించిందన్నారు. మోడీ పాలన ఎమర్జెన్సీని మించిపోతుందన్నారు. గత కొన్నేళ్ల నుంచి కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ లబ్ధి పొందుతున్న బీజేపీని సాగనంపాల్సిన అవసరం వచ్చిందన్నారు.

ముగిసిన బండలాగుడు పోటీలు


బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద ఉగాది పండగ సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు శుక్రవారం ముగిశాయి.నంద్యాల మండలం పెద్ద కొట్టాల గ్రామానికి చెందిన కేశవరెడ్డి వృషభాలు మొదటి బహుమతి రూ.70వేలు గెలుచుకున్నాయి. రెండో బహుమతి 60 వేలను అనంతపురం జిల్లా చక్రయపేటకు చెందిన రవీంద్రారెడ్డి వృషభాలు, మూడవ బహుమతి రూ.50వేలను అనంతపురం జిల్లా మేడ్డిమాకలపల్లె గ్రామానికి చెందిన తోట తిరుపాల్‌ ఎద్దు కైవసం చేసుకున్నాయి. నాలుగో బహుమతి రూ.40 వేలను నంద్యాల జిల్లా జిల్లెల గ్రామానికి చెందిన రవితేజ రెడ్డి వృషభాలు, ఐదవ బహుమతి రూ.30 వేలను నంద్యాల జిల్లా కానాలకు చెందిన చెన్నారెడ్డి ఎద్దు, ఆరవ బహుమతి రూ. 20 వేలను కర్నూలు నెలటూరుకు చెందిన కుమారస్వామి ఎద్దు, ఏడో బహుమతి రూ.10 వేలను ఎ. కోడూర్‌కు చెందిన రవీంద్రనాథ్‌ ఎద్దు, ఎనిమిదో బహుమతి రూ.5వేలను ప్రకాశం జిల్లా దర్శికి చెందిన రాజశేఖర్‌రెడ్డి వృషభాలు గెలుచుకున్నాయి. బహుమతుల ప్రదాన కార్యక్రమంలో నిర్వాహకులు కృష్ణారెడ్డి, గగ్గటూరు శ్రీనివాసరెడ్డి , సుబ్బారెడ్డి, వెంకటసుబ్బయ్య, రామలక్ష్మీయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో బాలిక అదృశ్యం

కర్నూలు(హాస్పిటల్‌): కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ మైనర్‌ బాలిక అదృశ్యమయ్యింది. తెలంగాణ రాష్ట్రం గద్వాలకు చెందిన బాలిక కుటుంబీకులు కొంతకాలంగా కర్నూలు నగరంలోని అశోక్‌నగర్‌లో నివాసముంటున్నారు. ఆ బాలికకు మైనార్టీ తీరకుండానే తల్లిదండ్రులు పెళ్లి చేయడంతో చైల్డ్‌ వెల్ఫేర్‌ కమిటీ సభ్యులు ఐసీడీఎస్‌కు అప్పగించారు. వారు ఆ బాలికను కొన్ని రోజుల క్రితం కర్నూలు ప్రభుత్వాసుపత్రి ఆవరణలోని మహిళా ప్రాంగణంలో ఉంచారు. మూడు రోజుల క్రితం బాలికకు కడుపునొప్పి రావడంతో ఆసుపత్రిలో చేర్చారు. ఇదే సమయంలో బాలిక ఆసుపత్రి నుంచి అదృశ్యమయ్యింది.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం

- 'ఫ్యామిలీ డాక్టర్‌' ను సద్వినియోగం చేసుకోండి
- పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి
- గోరంట్ల పర్యటనలో జిల్లా కలెక్టర్‌ కోటేశ్వరరావు


గోరంట్లలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్‌ కోటేశ్వరరావు

కోడుమూరు రూరల్‌: ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, అందులో భాగంగానే ఫ్యామిలీ డాక్టర్‌ కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టిందని జిల్లా కలెక్టర్‌ కోటేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని గోరంట్ల గ్రామంలో కలెక్టర్‌ పర్యటించారు. ఫ్యామిలీ డాక్టర్‌ సేవలను, కంటి పరీక్షల కేంద్రాన్ని, గ్రామ సచివాలయాలను, మహాత్మాజ్యోతి బాపూలే బాలుర వసతి గృహ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలన్న లక్ష్యంతో ఫ్యామిలీ డాక్టర్‌ కార్యక్రమాన్ని ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే గ్రామ సచివాలయ సిబ్బంది పనివేళల్లో తప్పనిసరిగా ప్రజలకందుబాటులో ఉండాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వారికి అందజేయాలని సూచించారు. అనంతరం గ్రామంలోని జగనన్న లేఅవుట్‌ను సందర్శించి ఇళ్ల నిర్మాణాల పురోగతిపై గృహ నిర్మాణ శాఖాధికారులతో సమీక్షించారు. లబ్ధిదారులతో మాట్లాడి గృహాలు త్వరగా నిర్మించుకునేలా చూడాలని సూచించారు.

పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

మహాత్మాజ్యోతి బాపులే బీసీ సంక్షేమ బాలుర వసతి గృహ పాఠశాలను జిల్లా కలెక్టర్‌ సందర్శించి పదవతరగతి విద్యార్థులతో మాట్లాడారు. పబ్లిక్‌ పరీక్షల్లో మంచి మార్కులతో పాసవ్వాలన్నారు. విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వంద శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లా కలెక్టర్‌ వెంట తహసీల్దార్‌ శేషఫణి, ఎంపీడీఓ చంద్రశేఖర్‌, ఈఈ నాగరాజు, ఆర్‌డబ్ల్యూఎస్‌, హౌసింగ్‌ డీఈఈలు ఏడుకొండలు, వాసుదేవరావు, ఏఈలు ప్రసాద్‌, గంగరాజు, గ్రామ సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులున్నారు.

ఏప్రిల్‌ 5న ఢిల్లీలో కర్షక ధర్నా


పోస్టర్లను విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

గూడూరు: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక , ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్‌ 5న ఢిల్లీలో కర్షక ధర్నా నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ కోడుమూరు డివిజన్‌ కార్యదర్శి జె. మోహన్‌ తెలిపారు. శుక్రవారం ఆయన అధ్యక్షతన హమాలీ సంఘం కార్యాలయం వద్ద ధర్నాకు సంబంధించిన పోస్టర్లను ఆ యూనియన్‌ నాయకులు ఆవిష్కరించారు. మోహన్‌ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాల రాస్తుందన్నారు. రైతులకు మేలు చేయకుండా ధనవంతులకు లబ్ధి చేకూరుస్తుందన్నారు. మోడీ ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ నిర్వహించే ధర్నాకు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. నాయకులు రంగన్న, కొమ్ము రాజు, ఆటో యూనియన్‌ నాయకులు రవి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మద్దిలేటి, మదు, మోహన్‌, ఆటో రాముడు, మారెప్ప, తదితరులు పాల్గొన్నారు.

క్షయపై అవగాహన అవసరం


పాణ్యంలో మాట్లాడుతున్న ఆయుర్వేద డాక్టర్‌ శ్రీదేవి

కల్లూరు: క్షయ వ్యాధిని సకాలంలో గుర్తిస్తే నివారణ సాధ్యమే అని కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి సైలెష్‌కుమార్‌ అన్నారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎమ్‌లు, ఆశా కార్యకర్తలు ప్రజలకు క్షయ నివారణ చర్యలను వివరించారు. తీవ్రమైన దగ్గు, రాత్రి సమయంలో జ్వరం వస్తే క్షయ వ్యాధి పరీక్ష చేయించుకోవాలని సూచించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

సి.బెళగల్‌: ప్రజలు సీజనల్‌ వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని ఎంఈఓ జ్యోతి అన్నారు. శుక్రవారం క్షయ (టీబీ) వ్యాధి నిర్మూలనపై సి.బెళగల్‌ ఏఎన్‌ఎం పుష్పలత, ఆశా వర్కర్లతో కలిసి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. వారం రోజులకు మించి దగ్గు ఉంటే ప్రజలు స్థానిక పీహెచ్‌సీ వైద్యులను సంప్రదించాలని సూచించారు. గ్రామంలో టీబీ చికిత్స, నివారణ కేంద్రం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

పాణ్యం: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పాణ్యం ఆయుర్వేద డాక్టర్‌ శ్రీదేవి అన్నారు. శుక్రవారం స్థానిక గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో పాణ్యం ఆయుష్‌ ఆధ్వర్యంలో టీబీ నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పొగాకు సంబంధ పదార్థాలను సేవించరాదని సూచించారు. కార్యక్రమంలో వార్డెన్‌ వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

చేపల ఉత్పత్తికి ప్రణాళికలు

కర్నూలు(అగ్రికల్చర్‌): జిల్లాలో చేపల ఉత్పత్తిని గణనీయంగా పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ పి.కోటేశ్వరరావు సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం వ్యవసాయ అనుబంధ శాఖలపై మినీ కాన్ఫరెన్స్‌ హాల్‌లో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్‌ మాట్లాడుతూ..కొత్తాళం నుంచి గూడూరు వరకు ఉన్న చౌడు భూముల్లో ఫిష్‌ పాండ్స్‌ ఏర్పాటు చేసి మత్స్య సంపదను పెంపొందించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం వ్యవసాయ, మైక్రో ఇరిగేషన్‌ విభాగాలతో సమన్వయం చేసుకోవాలన్నారు. రబీ పంటలకు సంబంధించి ఈ–క్రాప్‌ బుకింగ్‌ పూర్తయ్యిందని, రైతులు 96 శాతం మంది ఈ–కేవైసీ ద్వారా ధ్రువీకరించుకున్నారని చెప్పారు. సమావేశంలో జాయింట్‌ కలెక్టర్‌ రామసుందర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి పి.ఎల్‌.వరలక్ష్మి, మత్స్య శాఖ డీడీ శ్యామల, ఏపీ ఎంఐపీ ఈడీ ఉమాదేవి, ఉద్యానశాఖ ఏడీ పి.రామాంజనేయులు, పశుసంవర్ధక శాఖ జేడీ రామచంద్రయ్య, ఇరిగేషన్‌ ఎస్‌ఈ రెడ్డి శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురి పెడితే.. పతకమే!


ఆర్చరీ శిక్షణలో విల్లును ఎక్కు పెట్టిన చిన్నారులు

- ఆర్చరీలో రాణిస్తున్న కర్నూలు క్రీడాకారులు
- జాతీయస్థాయిలో గుర్తింపు

కర్నూలు (టౌన్‌): విలు విద్య(ఆర్చరీ)లో కర్నూలు నగరానికి చెందిన చిన్నారులు ప్రతిభ చాటుతున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో పతకాలు సాధిస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. క్రీడా ప్రతినిధులచే ఔరా అనిపించుకుంటున్నారు. వీరిని చూస్తే.. పిట్ట కొంచెం..కూత ఘనం అన్న నానుడి సరిగ్గా సరిపోతుంది. వీరు పాఠశాలల్లో ఒకటి, రెండు తరగతులే చదువుతున్నా ఆర్చరీ పోటీల్లో గురి పెట్టారంటే.. పతకం కొట్టాల్సిందే అన్నట్లు ఆటను ప్రదర్శిస్తున్నారు.

స్పోర్ట్స్‌ అథారిటీ స్టేడియంలో ఆర్చరీ శిక్షణ

విలువిద్య ఇది ఒక ప్రాచీన క్రీడ.గతంలో మహాభారతం,రామాయణం వంటి కథలకే పరిమితమైన ఈ క్రీడ తరువాత వేటకు రాను రాను కాల క్రమేణలో ఒలంపిక్స్‌ క్రీడగా గుర్తింపు పొందింది. ఎన్నో ఏళ్ల చరిత్ర ఉన్న ఈ ఆర్చరీకి కర్నూలు స్పోర్ట్స్‌ అథారిటీ స్టేడియంలోనూ అన్ని సౌకర్యాలు ఉన్నాయి. క్రీడాకారుల కోసం ఇద్దరు కోచ్‌లు ఉన్నారు.2004 నుంచి ఏటా 50 నుంచి 60 మందికి శిక్షణ ఇస్తున్నారు. వేసవి శిక్షణశిబిరంలో ఈ క్రీడాకు ప్రత్యేక ఆదరణ ఉంది. తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకొచ్చి వేసవి శిక్షణ శిబిరంలో ఆర్చరీలో శిక్షణ ఇప్పిస్తున్నారు. ఇప్పటి వరకు దాదాపు 11 మంది కర్నూలు క్రీడాకారులు సబ్‌ జూనియర్‌ స్థాయిలో ఆల్‌ ఇండియా పోటీల్లో రాణించి పతకాలు సాధించారు.అంతేగాక ఎంతో మంది జిల్లా, రాష్ట్రస్థాయిలో తమ సత్తా చాటుతూ పతకాల వేట సాగిస్తున్నారు. విలువిద్యలోని రికర్వ్‌బో(70మీటర్లు), ఇండియన్‌బో(30–50 మీటర్లు), కాంపౌండ్‌బౌ(50–50 మీ)లలో పోటీలు నిర్వహిస్తారు.

2004 నుంచి ఆర్చరీ పోటీలు



స్థానిక స్పోర్ట్స్‌ అథారిటీ స్టేడియంలో 2004 సంవత్సరం నుంచి ఆర్చరీ పోటీలు నిర్వహిస్తున్నాం. ఆర్చరీ క్రీడకు మంచి ఆదరణ ఉంది. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహిస్తున్నారు. ఇప్పటికే కర్నూలు నుంచి 20 మందికి పైగా మహిళలు, పురుషుల విభాగంలో సబ్‌ జూనియర్‌,జూనియర్‌విభాగాల్లో జాతీయ స్థాయి లో గుర్తింపు తెచ్చుకున్నారు. వేసవి సెలవుల్లో స్టేడియంతో పాటు బి.క్యాంపు క్రీడామైదానంలో ఉచితంగా ఆర్చరీ శిక్షణ ఇస్తున్నాం. అలాగే ప్రతి రోజు స్టేడియంలో శిక్షణ ఉంటుంది. 18 సంవత్సరాలుగా కర్నూలులోనే జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తున్నాం.


–నాగరత్నమయ్య, కార్యదర్శి, జిల్లా ఆర్చరీ అసోసియేషన్‌

'అద్వితీ'య ప్రతిభ



అద్వితీ ఆర్చరీ క్రీడాకారిణి. స్థానిక సోమిశెట్టినగర్‌లో నివసిస్తున్న ఈ చిన్నారి కర్నూలు గురుకుల విద్యాలయంలో ఒకటవ తరగతి చదువుతుంది. తల్లిదండ్రులు వ్యాపారం చేస్తున్నారు. చిన్నారి ఆర్చరీ పోటీల్లో పాల్గొంటే పతకం ఖాయం. గత ఏడాది ఆగస్టులో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో, నవంబర్‌ నెలలో ధ్యాన్‌ చంద్‌ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లోనూ బంగారు పతకాలు సాధించింది. అలాగే విజయవాడలో గతేడాది డిసెంబర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభచాటి బంగారు పతకం కైవసం చేసుకుంది. ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో 6వ స్థానంలో నిలిచింది.

ఆర్చరీలో యోగానంద్‌కు ప్రత్యేక గుర్తింపు



యోగానంద్‌ ఏథీనా పాఠశాలలో రెండవ తరగతి చదువుతున్నాడు. స్థానికంగా గుత్తి పెట్రోల్‌ బంకు సమీపంలోని కాలనీలో నివసిస్తున్నాడు. తల్లిదండ్రులు సునీల్‌, శిరీషా వృత్తిరీత్యా వ్యాపారం చేస్తున్నారు. ఆర్చరీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. ప్రతి పోటీల్లోనూ రాణిస్తూ ఆల్‌ఇండియా స్థాయిలో 64వ ర్యాంకు సాధించాడు. ఆంధ్రప్రదేశ్‌లో 14వ స్థానంలో ఉన్నాడు. గత మార్చి నెలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో బంగారు పతకం, డిసెంబర్‌ నెలలో విజయవాడలో నిర్వహించిన పోటీల్లోనూ బంగారు పతకం సాధించాడు.

ఆల్‌ ఇండియాలో 69వ ర్యాంకు కె.పార్థచంద్ర



కె.పార్థచంద్ర మాంటిస్సోరి పాఠశాలలో ఒకటవ తరగతి చదువుతున్నాడు. స్థానికంగా లక్ష్మీనగర్‌లో నివసిస్తున్నాడు. తండ్రి వంశీకృష్ణ ఆర్చరీలో జాతీయ స్థాయిలో రాణించాడు. ప్రస్తుతం కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు. కుమారుడు సైతం ఇదే క్రీడలో మంచి ప్రతిభ చాటుతున్నాడు. ఇప్పటికే ఆల్‌ ఇండియా స్థాయిలో 69వ ర్యాంకు సాధించాడు. స్పోర్ట్స్‌ అథారిటీ స్టేడియంలో గత ఏడాది ఆగస్టు, నవంబర్‌ నెలలలో రెండు సార్లు నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని బంగారు పతకాలు సాధించాడు. ధ్యాన్‌చంద్‌ క్రీడల్లో పాల్గొని వెండి పతకం, విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో 6వ స్థానంలో నిలిచాడు.